క్లుప్తంగా

టీటీడీ చైర్మన్‌కు ఉద్యోగుల కృతజ్ఞతలు



టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డిని గజమాలతో సత్కరిస్తున్న టీటీడీ ఉద్యోగులు

తిరుపతి మంగళం: టీటీడీ ఉద్యోగ, కార్మికులు టీటీడీ చైర్మన్, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డిని అభినందనలు, కృతజ్ఞతలతో ముంచెత్తారు. టీటీడీ పాలకమండలి సమావేశాల్లో ఉద్యోగులు, కార్మికుల సంక్షేమానికి తీసుకుంటున్న నిర్ణయాలు అభినందనీయమని వారు పేర్కొన్నారు. సోమవారం తిరుపతి పద్మావతిపురంలోని టీటీడీ చైర్మన్ నివాసంలో భూమన కరుణాకరరెడ్డికి దుశ్శాలువాలు కప్పి గజమాలతో ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. టీటీడీ ఉద్యోగులకు ఇళ్ల స్థలాలు కేటాయించిన ఘనత కరుణాకరన్నకే దక్కుతుందన్నారు.

ఆలయ పనులు పూర్తి చేయాలి



గంగమ్మ ఆలయంలో పునర్నిర్మాణ పనులను పరిశీలిస్తున్న టీటీడీ చైర్మన్ భూమన

తిరుపతి కల్చరల్: శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో చేపడుతున్న ఆలయ పునర్నిర్మాణ పనుల్లో మరింత వేగం పెంచి త్వరగతిన పనులు పూర్తి చేసి భక్తులకు అందుబాటులోకి తేవాలని టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి ఆదేశించారు. గంగమ్మ ఆలయంలో చేపడుతున్న ఆలయ పునర్నిర్మాణ పనులను టీటీడీ చైర్మన్ సోమవారం సాయంత్రం పరిశీలించారు. ముందుకు ఆలయంలోని గంగమ్మ తల్లిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయంలో జరుగుతున్న పనులను గురించి అడిగి తెలుసుకున్నారు. టీటీడీ చైర్మన్‌తోపాటు మేయర్ డాక్టర్ శిరీష, ఆలయ చైర్మన్ కట్టా గోపియాదవ్, వైఎస్సార్ సీపీ నేతలు దొడ్డారెడ్డి సిద్ధారెడ్డి, గోపాల్‌రెడ్డి, మాజీ చైర్మన్ భరణీ యాదవ్, ఆలయ కమిటీ సభ్యుడు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఉత్సాహంగా టీటీడీ ఉద్యోగుల క్రీడా పోటీలు



వాలీబాల్ పోటీల్లో పాల్గొంటున్న మహిళా ఉద్యోగులు

తిరుపతి(అలిపిరి): టీటీడీ పరిపాలనా భవనం వెనుకవైపు పరేడ్ గ్రౌండ్‌లో టీటీడీ ఉద్యోగులకు క్రీడాపోటీలు పోటాపోటీగా సాగుతున్నాయి. సోమవారం ప్రత్యేక ప్రతిభావంతులైన ఉద్యోగుల క్యారమ్స్ సింగిల్స్ పోటీల్లో జె.భాస్కర్ విజేతగా నిలవగా.. పిజె.మణిచంద్రన్ రన్నరప్‌గా నిలిచారు. ప్రత్యేక ప్రతిభావంతులైన ఉద్యోగుల క్యారమ్స్ డబుల్స్ పోటీల్లో జె.భాస్కర్, ఎల్.విద్యాసాగర్ జట్టు విజయం సాధించగా.. పీజే మణిచంద్రన్, పి.రమణ జట్టు రన్నరప్‌గా నిలిచింది. అలాగే మహిళా ఉద్యోగులు షటిల్ బ్యాడ్మింటన్, వాలీబాల్ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఆర్టీసీలో కాంట్రాక్ట్ డ్రైవర్ ఉద్యోగాలు

తిరుపతి అర్బన్: ఆర్టీసీలో కాంట్రాక్ట్ డ్రైవర్ ఉద్యోగాలను భర్తీ చేయనున్నట్టు డీపీటీవో చెంగల్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. తిరుపతి, అలిపిరి, మంగళం డిపోల్లో రోజువారి వేతనం పద్ధతిలో పనిచేయడానికి ఆసక్తి గల వారు ఆయా డిపో మేనేజర్లు లేదా తిరుపతి జిల్లా ప్రజా సమాచార అధికారి ఎం.పార్థసారథికి ఒరిజినల్ లైసెన్స్ సర్టిఫికెట్ చూపాలని సూచించారు. అయితే 18 నెలలు పూర్తి చేసుకున్న హెవీ డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న వారు అర్హులని స్పష్టం చేశారు. ఆసక్తి గల వారు తిరుపతి డిపో మేనేజర్ బాలాజీ-9959225670, అలిపిరి డీఎం హరిబాబు-9959225671, మంగళం డీఎం భాస్కర్-7893723453 నంబర్లలో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

మంగళం అడవుల్లో మంటలు



మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నిస్తున్న స్థానిక ప్రజలు

తిరుపతి మంగళం: మంగళం తుడా క్వార్టర్స్ శివారు ప్రాంతంలోని అటవీప్రాంతంలో కొందరు ఆకతాయిలు నిప్పు రగిలించడంతో అగ్నిజ్వాలలు ఎగసిపడ్డాయి. దాంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. విషయం తెలుసుకున్న అటవీ సిబ్బంది హుటాహుటిన అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేశారు.

హైటెక్.. రహదారులు



- అత్యంత సుందరంగా కులశేఖర ఆళ్వార్ మార్గం
- కరకంబాడి- రేణిగుంట రోడ్లను సులభంగా కలిపే గోదాదేవి మార్గం
- ఆకట్టుకుంటున్న కొత్త రహదారులు
- పచ్చదనం పరవళ్లు తొక్కుతున్న వైనం

తిరుపతి తుడా: ఆధ్యాత్మిక నగరంలో చేపట్టిన రహదారుల నిర్మాణంతో తిరుపతి దశ మారుతోంది. కొత్త రహదారుల నిర్మాణంతో సరికొత్త తిరుపతి ఆవిష్కృతమవుతోంది. మూడేళ్ల కాలంలో 21 మాస్టర్ ప్లాన్ రోడ్లకు శ్రీకారం చుట్టారు. ఇందులో ఇప్పటికే 16 అందుబాటులోకి రాగా.. మరో రెండు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. ఈ రహదారుల నిర్మాణంతో తిరుపతి నగరం మరో 5 వేల ఎకరాల్లో విస్తరించనుంది. ఈ దిశగా ఇప్పటికే అడుగులు పడ్డాయి. ఈ రహదారులతో ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వెళ్లేందుకు అత్యంత అనువుగా మారింది. ఇతర ప్రాంతాల నంచి వచ్చే వాహనదారులు నగరంలోకి ప్రవేశించేందుకు సులభవంతమైన కనెక్టివిటీ పెరిగింది. దీంతో నగరంలో ట్రాఫిక్ ఒత్తిడి తగ్గుముఖం పట్టింది.

తిరుపతికి మహర్దశ

రహదారుల అభివృద్ధితో తిరుపతి నగరానికి మహర్దశ పట్టింది. తిరుపతి తూర్పు ప్రాంత విస్తరణకు అడుగులు పడ్డాయి. రహదారుల అభివృద్ధితో నెలల వ్యవధిలోనే వందలాది నిర్మాణాలు పురుడు పోసుకుంటున్నాయి. తిరుమల శ్రీవారి దర్శనం కోసం దేశవిదేశాల నుంచి వేలాది మంది యాత్రికులు వస్తుంటారు. రోజూ లక్ష మంది వరకు వస్తుంటారని అంచనా. దీంతో తిరుపతి నగరంపై ఒత్తిడి ఎప్పటి కప్పుడు పెరుగుతూనే ఉంది. తిరుపతి నగరంలో రద్దీ నానాటికీ పెరుగుతున్నా నాటి రహదారులే దిక్కుగా మారాయి. అలాంటి పరిస్థితుల్లో నగరం నిత్యం ట్రాఫిక్ చక్రబంధంలో చిక్కుకుంది. ఉన్న ఇరుకురోడ్లతో నగరవాసులకు ట్రాఫిక్ కష్టాలు తప్పడంలేదు. ఈ పరిస్థితుల్లో నగర డిప్యూటీ మేయర్, వైఎస్సార్ సీపీ తిరుపతి సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి రహదారుల అవశ్యకతను గుర్తించారు. తన శక్తియుక్తులకు పదునుపెట్టి తిరుపతి నగర విస్తరణ, ఇతర ప్రాంతాల నుంచి కనెక్టివిటీ పెంచడం, నగరంపై ట్రాఫిక్ ఒత్తిడిని తగ్గించడమే లక్ష్యంగా 21 మాస్టర్ ప్లాన్ రోడ్లకు శ్రీకారం చుట్టారు. ఇంతటితో ఆగకుండా సుమారు 38కిపైగా లింక్ రోడ్లు, నగర నడిబొడ్డున కనెక్టివిటీ రోడ్లను అభివృద్ధి చేశారు. దీంతో నవీన తిరుపతి ఆవిష్కరణకు అడుగులు పడ్డాయి. అనుకున్న లక్ష్యం చేరుకునే విధంగా రహదారుల నిర్మాణాలు పూర్తిచేసుకుంటున్నాయి.

కొత్త రహదారుల సొబగులు

తిరుపతి నగరంలో నిర్మించిన రహదారులు నగరవాసులకు కొత్త అనుభూతులను మిగులుస్తున్నాయి. ముఖ్యంగా కులశేఖర ఆళ్వార్ 100 అడుగుల మాస్టర్ ప్లాన్ రోడ్డును అత్యంత అద్భుతంగా తీర్చిదిద్దారు. రోడ్డుకు ఇరువైపులా విద్యుత్ వెలుగులు, రోడ్డుకు మధ్యన 24 అడుగుల డివైడర్‌ను అభివృద్ధి చేశారు. ఈ డివైడర్‌లో అందమైన పూల మొక్కలను పెంచుతున్నారు. తమిళనాడు నుంచి తెప్పించిన ఈత చెట్లుతో సరికొత్తదనం అలముకుంది. దీంతో ఈ రహదారి పచ్చదనం, ఆకర్షణీయమైన విద్యుత్ వెలుగులు తొణికిసలాడుతున్నాయి. గోదాదేవి 80 అడుగుల రహదారి పచ్చని పొలాల మధ్య విద్యుత్ వెలుగులతో దేదీప్యమానంగా మారింది.

దేశభక్తిని చాటిచెప్పేలా..

కులశేఖర ఆళ్వార్ మార్గంలో దేశ భక్తులు, స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాలను ఏర్పాటు చేశారు. ఈ రహదారికి తూర్పువైపున (కాటన్ మిల్ కూడలి వద్ద నేతాజీ సుభాష్ చంద్రబోస్, హీరో హోండా షో రూమ్ రైల్వే గేటు వద్ద సుఖ్‌దేవ్, భగత్ సింగ్, శివరామ్ హరి రాజ్ గురు విగ్రహాలను ఏర్పాటు చేశారు. ఈ విగ్రహాల ఏర్పాటుతో దేశ భక్తి విరాజిల్లుతోంది. అలానే రోడ్డుకు సగభాగంలో వాటర్ ఫౌంటెయిన్ ఏర్పాటు చేస్తున్నారు.

మాస్టర్ ప్లాన్ రోడ్ల వివరాలు

మాస్టర్ ప్లాన్ రోడ్ల రూపకర్త : వైఎస్సార్ సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి

మొత్తం మాస్టర్ ప్లాన్ రోడ్లు	21
ఇప్పటి వరకు ప్రారంభించినవి	16
ప్రారంభానికి సిద్ధంగా ఉన్నవి	2

రహదారి పేరు: కులశేఖర ఆళ్వార్ మార్గం

- రహదారి విస్తీర్ణం: 100 అడుగుల
- పొడవు: 1350 మీటర్లు
- డివైడర్, గ్రీనరీ: 24 అడుగుల వెడల్పు
- ఇందుకోసం చేసిన ఖర్చు: రూ.10.50 కోట్లు
- హీరో హోండా షో రూమ్–కాటన్‌మిల్ రైల్వే గేటును కలుపుతూ నిర్మాణం (మూడు మాస్టర్ ప్లాన్ రోడ్లను ఈ మార్గానికి కలుపుతూ నిర్మాణం)

రహదారి పేరు : గోదాదేవి మార్గం

- రహదారి పొడవు : 2.25 కిలోమీటర్లు
- రహదారి వెడల్పు : 80 అడుగులు
- డివైడర్, గ్రీనరీ : 4 అడుగులు
- ఇందుకోసం చేసిన ఖర్చు: రూ.8.95 కోట్లు
- కరకంబాడి రోడ్డు తిమ్మినాయుడుపాళెం–కాటన్ మిల్ రైల్వే గేటు మీదుగా రేణిగుంట రోడ్ ను కలుపుతూ ఈ రహదారి నిర్మాణం

తిరుపతి అభివృద్ధే లక్ష్యం

తిరుపతి అభివృద్ధే నా ఏకైక లక్ష్యం. అందుకోసం రాజీలేని నిర్ణయాలను అమలు చేస్తున్నాను. ఇందుకు సహకరిస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, మేయర్ శిరీషతోపాటు కౌన్సిల్ మొత్తానికి కృతజ్ఞతలు. ఏ నగరమైనా అభివృద్ధి చెందాలంటే అందుకు ఆ నగర రహదారులపై ఆధారపడి ఉంటుంది. గత పాలకుల నిర్లక్ష్యంతో తిరుపతి దశాబ్దాలుగా నగర విస్తరణకు నోచుకోలేదు. ఏళ్లకు ముందు ఉన్న రోడ్లే దిక్కుగా ఉన్నాయి. తద్వారా తిరుపతి విస్తరణ జరగలేదు. నగరంపై నిత్యం ట్రాఫిక్ ఒత్తిడి ఉండేది. బస్టాండ్‌కు 100 మీటర్ల దూరం నుంచే తిరుపతి అభివృద్ధి కుంటుపడడానికి కారణం రోడ్ల వ్యవస్థ లేకపోవడమేనని గుర్తించాను. ఆ సమస్యను అధిగమించేందుకు 21 మాస్టర్ ప్లాన్ రోడ్లకు శ్రీకారం చుట్టాను. రాబోయే రోజుల్లో తిరుపతిని మరింత అభివృద్ధి చేసి చూపిస్తాను.

– భూమన అభినయ్‌రెడ్డి, డిప్యూటీ మేయర్, వైఎస్సార్ సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయ కర్త



సుందరంగా తయారైన తిరుపతి రహదారులు



పచ్చదనం ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి



కులశేఖర ఆళ్వార్ మార్గంలో ఏర్పాటు చేసిన స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాలు

అభినయ్ అంటేనే అభివృద్ధి

- ఆత్మీయ సమావేశాల్లో ముక్తకంఠంతో చెబుతున్న నగర ప్రజలు
- వచ్చే ఎన్నికల్లో ఆదరించండి.. మరింత అభివృద్ధి చేస్తాం...
- డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి

తిరుపతి మంగళం: నగరంలో అభినయ్ అంటేనే అభివృద్ధిగా విశ్వసిస్తున్నామని నగర ప్రజలంతా ముక్తకంఠంతో చెబుతున్నారు. తిరుపతి నగరంలో ఎన్నడూ చూడనంతగా అభివృద్ధి చేసిన భూమన అభినయ్‌రెడ్డి లాంటి యువ నాయకుడితో తిరుపతి మరింత అభివృద్ధి చెందుతుందని విశ్వసిస్తున్నామని ఆత్మీయ సమావేశంలో స్పష్టం చేశారు. నగరంలోని శివజ్యోతినగర్‌లోని రత్నం స్కూల్ వద్ద, తిమ్మినాయుడుపాళెం గ్రామంలో సోమవారం నిర్వహించిన ఆత్మీయ సమావేశాల్లో స్థానిక ప్రజలు అశేషంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్, తిరుపతి సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి మాట్లాడుతూ కేవలం రెండేళ్లల్లో తిరుపతి రూపురేఖలు మార్చామని తెలిపారు. రాష్ట్రంలో జగనన్న, తిరుపతిలో తనను ఆశీర్వదించాలని కోరారు. నాలుగన్నరేళ్లల్లో జగనన్న చేసిన మంచి, మేలు చూశారని, తిరిగి అధికారంలోకి వస్తే మరింత మేలు చేస్తారని చెప్పారు. తిరుపతి నగరాన్ని కూడా పరిశుభ్రమైన నగరంతో పాటు క్రైం ఫ్రీ సిటీగా కూడా మారుస్తానని హామీ ఇచ్చారు. వచ్చే ఎన్నికల్లో అన్ని వర్గాలవారు తనను ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. కార్పొరేటర్లు డాక్టర్ అనీష్‌కుమార్‌రాయల్, ఆదం రాధాకృష్ణారెడ్డి, బోకం అనిల్‌కుమార్, టౌన్‌బ్యాంక్ వైస్ చైర్మన్ వాసుమయాదవ్, నాయకులు పాముల రమేష్‌రెడ్డి, కృష్ణచైతన్యయాదవ్, బాబూయాదవ్, సోము, రాజేంద్ర, రాజేశ్వరి స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

పథకాలపై అవగాహన అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

తిరుపతి అర్బన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలపై అందరికీ అవగాహన ఉండాలని కలెక్టర్ జి.లక్ష్మీశ పేర్కొన్నారు. ఈ నెల 13న ప్రధాన మంత్రి వర్చువల్ విధానంలో సూరజ్ పోర్టల్ ప్రారంభించి, కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్ధిదారులతో ముఖాముఖి నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ సహకారంతో వివిధ శాఖలు, కార్పొరేషన్ల ద్వారా లబ్ధి పొందిన వారు, బ్యాంకుల నుంచి రుణాలు పొందిన లబ్ధిదారులు ఈ సమావేశానికి మొబిలైజేషన్ చేయాలని సూచించారు. ఈ నెల 13న 4గంటలకు భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ వర్చువల్ విధానంలో దేశంలోని పలు జిల్లాల అధికారులు, లబ్ధిదారులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించనున్నారని తెలిపారు. ఈ సమావేశంలో నోడల్ అధికారులు నరసింహులు, చెన్నయ్య, ఎల్డీఎం సుభాష్, డీఆర్‌డీఏ పీడీ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

తొలి ఓటు అభివృద్ధికి వేద్దాం

తిరుపతి సిటీ: తిరుపతి అభివృద్ధికి అహర్నిశలు కష్టపడుతున్న భూమన అభినయ్‌రెడ్డికి మన తొలి ఓటు వేసి అఖండ మెజారిటీతో గెలిపించుకుందామని వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం నాయకులు ఎం.ప్రేమ్ కుమార్, పసుపులేటి సురేష్ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక ఏటీఎస్ఎస్ డిగ్రీ కళాశాలలో కొత్తగా ఓటు హక్కు పొందిన విద్యార్థులతో వారు సమావేశం నిర్వహించారు. ఓటు హక్కు సక్రమంగా వినియోగించుకోవాలని, అభివృద్ధి లక్ష్యంగా యువత భవిష్యత్ కోసం కష్టపడుతున్న యువ నాయకుడు భూమన అభినయ్‌రెడ్డికి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించుకుందామని తెలిపారు. కేవలం రెండేళ్లలో అభినయ్‌రెడ్డి తిరుపతి రూపురేఖలు మార్చారని తెలిపారు. మంచి జరిగింది కాబట్టే తొలి ఓటును అభివృద్ధి కోసం వినియోగించుకోవాలని కోరారు. సీఎం జగనన్న నాడు–నేడుతో పాఠశాలల రూపురేఖలు మార్చారని, అమ్మ ఒడి, ఫీజురీయింబర్స్‌మెంట్, జగనన్న విద్య, వసతి దీవెనతో మనం ఎంతో లబ్ధి పొందామని గుర్తు చేశారు. ఆ పార్టీ నాయకులు వినయ్, కిరణ్ రాయల్, విజయ్ భాస్కర్, సాయి చరణ్, ముని పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం నాయకులు

టైం స్కేల్ ఉద్యోగుల సమస్యలు తీర్చండి



ఉన్నత విద్యా మండలి చైర్మన్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న టైంస్కేల్ ఉద్యోగులు

తిరుపతి సిటీ: ఎస్వీ యూనివర్సిటీలో టైంస్కేల్ ఉద్యోగులుగా పనిచేస్తున్న సిబ్బంది పదవీ విరమణ వయస్సుపై అనుమానాలు ఉన్నాయని వాటిని వెంటనే పరిష్కరించాలని ఆ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సుబ్రమణ్యంరెడ్డి విన్నవించారు. సోమవారం స్థానిక పద్మావతి మహిళా వర్సిటీకి విచ్చేసిన ఉన్నత విద్యా మండలి చైర్మన్ హేమచంద్రారెడ్డిని వారు కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వెల్లడించిన జీవోలో నాన్ టీచింగ్ ఉద్యోగుల పదవీ విరమణ వయస్సు 62 ఏళ్లకు పొడిగించామన్నారు. ఆ జీవోలో శాశ్వత ఉద్యోగులకు మాత్రమే అనే పదం వాడడంతో టైం స్కేల్ ఉద్యోగులలో ఆందోళన వ్యక్తమవుతోందన్నారు. ఈ విషయంపై ప్రభుత్వం దృష్టి సారించాలని చైర్మన్‌కు విన్నవించారు. ఆ సంఘం కార్యదర్శి గోపీ, ప్రసాద్‌రెడ్డి, నాగరాజు, తిరుపాల్‌రెడ్డి, మునీంద్ర, విజయ్, చంద్ర, రెడ్డెప్పరెడ్డి ఉన్నారు.

విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తే ధ్యేయం

తిరుపతి సిటీ: విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తే ధ్యేయంగా వర్సిటీ అంతర్జాతీయ సదస్సులు నిర్వహించడం అభినందనీయమని ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ కే హేమచంద్రారెడ్డి పేర్కొన్నారు. పద్మావతి మహిళా వర్సిటీలో సోమవారం ఇన్నోవేషన్స్ ఇన్ అడ్వాన్స్‌డ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజన్స్ అండ్ ఆగ్మెంటెడ్ రియాలిటీ అనే అంశంపై జరిగిన అంతర్జాతీయ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మొట్టమొదటిగా మహిళా వర్సిటీలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజన్స్ సెంటర్ విస్తరించిందని కొనియాడారు. ఏఐ వాడకంలోకి రావడంతో ఉన్న ఉద్యోగ అవకాశాలు తగ్గి కొత్త ఉద్యోగ అవకాశాలు ఏర్పడుతున్నాయన్నారు. భవిష్యత్తులో విద్యార్థులు ఎదుర్కొనే సమస్యలు సవాళ్లను గుర్తుపెట్టుకుని వారికోసం ఇలాంటి సదస్సులు ఏర్పాటు చేయడం అవసరమన్నారు. వర్సిటీ మరింత పురోభివృద్ధి చెందాలని ఆయన ఆకాంక్షించారు.

తేనెటీగల పెంపకంపై రాష్ట్ర స్థాయి సెమినార్

తిరుపతి సిటీ : తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో ఈ నెల 14 నుంచి రెండు రోజుల పాటు తేనెటీగల పెంపకంపై రాష్ట్ర స్థాయి సెమినార్ నిర్వహించనున్నట్లు ఏడీఆర్ డాక్టర్ సి.రమణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తేనెటీగల పెంపకాన్ని ప్రోత్సహించేందుకు ఈ సెమినార్‌ను నిర్వహిస్తున్నామని తెలియజేశారు. ఇందులో ప్రధానంగా తేనెటీగల పెంపకంలో మెలకువలు, ప్యాకేజింగ్, ప్రాసెసింగ్, మార్కెటింగ్ వంటి అంశాలపై నిష్ణాతులైన శాస్త్రవేత్తలు, రైతులకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు, మహిళలు, గ్రామీణ యువత, ఔత్సాహికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అనంతకృష్ణశర్మకు ఘన నివాళి

తిరుపతి కల్చరల్: సంగీత, సాహిత్యంలో సమప్రజ్ఞ గల వాగ్గేయకారుడు రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ అని అన్నమాచార్య ప్రాజెక్టు సంచాలకుడు డాక్టర్ ఆకెళ్ల విభీషణశర్మ కొనియాడారు. టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు, హిందూ ధార్మిక సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో తిరుపతిలోని అన్నమాచార్య కళామందిరంలో సోమవారం రాత్రి రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ 45వ వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం శ్రీపద్మావతి మహిళా వర్సిటీ మార్గంలోనున్న రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ విగ్రహానికి టీటీడీ అధికారులు పుష్పాంజలి ఘటించారు. అనంతరం రాత్రి నిర్వహించిన సభ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన డాక్టర్ ఆకెళ్ల విభీషణ శర్మ మాట్లాడుతూ 1947లో శ్రీవేంకటేశ్వర ప్రాచ్య పరిశోధనా సంస్థ బాధ్యతలను రాళ్లపల్లికి టీటీడీ అప్పగించిందన్నారు. తిరుమల శ్రీవారి ఆలయంలోని తాళ్లపాక అరలోంచి వెలుగుచూసిన రాగి రేకులను పరిష్కరించి గ్రంథస్థం చేయడంతోపాటు కొన్ని వందల సంకీర్తనలను ఆయన స్వరపరిచారని తెలిపారు. రాళ్లపల్లి వారి మనవరాలు, జాతీయ సంస్కృత వర్సిటీ ఆంగ్ల శాఖ విభాగాధిపతి ఆచార్య రాళ్లపల్లి దీప్తి రాళ్లపల్లివారి వైదుష్యం అనే అంశంపై ప్రసంగించారు. ప్రముఖ గాయకురాలు ఎన్‌సీ. శ్రీదేవి మాట్లాడుతూ రాళ్లపల్లి వారి స్వీయ కృతులు అనే అంశంపై ప్రసంగించారు. టీటీడీ డీఈఓ డాక్టర్ భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.



రాళ్లపల్లి అనంతకృష్ణశర్మకు పుష్పాంజలి ఘటించి నివాళులర్పిస్తున్న టీటీడీ అధికారులు

మేనేజ్‌మెంట్ కోర్సులకు దరఖాస్తులు

తిరుపతి కల్చరల్: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ ట్రావెల్ మేనేజ్‌మెంట్‌లో ఎంబీఏ, బీబీఏ కోర్సుల ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ సంస్థ అసిస్టెంట్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి నరేష్ తెలిపారు. ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు 2024–25 ఏడాదికి టూరిజం, ట్రావెల్ మేనేజ్‌మెంట్‌లో ఎంబీఏ, బీబీఏ కోర్సుల ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వివరించారు. ఆసక్తి కల వారు www.iitttmouth.org వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా జూన్ 5వ తేదీలోపు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 99664 62786, 94907 87854ను సంప్రదించాలని తెలియజేశారు. సంస్థ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అభిలాష్ పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 12 కంపార్ట్‌మెంట్లు నిండాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 76,213 మంది స్వామి వారిని దర్శించుకోగా 19,477 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.88 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

క్లుప్తంగా

వారపు సంతలో భోజన సౌకర్యం


సంతలో భోజనాలు వడ్డిస్తున్న నాయకులు

పాకాల: ఆర్టీసీ బస్టాండ్‌కు సమీపంలో నిర్వహిస్తున్న వారపు సంతలో రైతులు, వ్యాపారులు, ప్రజలకు చంద్రగిరి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా చైర్మన్, చంద్రగిరి వైఎస్ఆర్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఉచితంగా భోజనాలను అందజేశారు. సోమవారం స్థానిక నాయకుల చేతుల మీదుగా భోజనాలను సరఫరా చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రైతులు, ప్రజలు, వ్యాపారులు భోజనాలకు ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో భోజనాలను సరఫరా చేస్తున్నారని వివరించారు. పాకాలతోపాటు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో జరిగే వారపు సంతల్లో భోజనాలను సరఫరా చేస్తున్నారని వివరించారు. అన్ని సమయాల్లో తమకు అండగా ఉండే ఎమ్మెల్యే కుటుంబానికి రుణపడి ఉంటామని, రాబోయే ఎన్నికల్లో వారికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని రైతులు, వ్యాపారులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీనాగాలమ్మ ఆలయంలో యంత్ర ప్రతిష్ట

చంద్రగిరి: ఫ్లై ఓవర్ బ్రిడ్జి సమీపంలో వెలసిన శ్రీనాగాలమ్మ దేవాలయంలో అమ్మవారి ఆలయ యంత్ర సహిత గణపతి, సుబ్రమణ్య స్వామివార్ల విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం సోమవారం వైభవంగా ప్రారంభమైంది. ఇందులో భాగంగా సోమవారం సాయంత్రం 7 గంటలకు ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. ముందుగా యాగశాల ప్రదక్షిణం, భూత బలిహరణం, యాగశాల ప్రవేశం కార్యక్రమాలను నిర్వహించారు. తదుపరి గణపతి పూజ, పుణ్యాహవచనం, పంచగవ్య మండపారాధనం, అఖండ దీపారాధన, మృత్సంగ్రహణం, అంకురార్పణ, అగ్నిప్రతిష్ఠాపన, వాస్తుపూజ, వాస్తు హోమం, చతుర్వేద స్వస్తి, నీరాజన మంత్ర పుష్ప కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీమూలస్థాన ఎల్లమ్మ ఆలయ మాజీ చైర్మన్ ఒంటి శివశంకర్‌రెడ్డి దంపతులు పూజల్లో పాల్గొన్నారు. భక్తులందరూ ఈ మహోత్సవంలో పాల్గొనాలని ఆయన కోరారు.

మహిళలకు టైలరింగ్‌పై ఉచిత శిక్షణ

చంద్రగిరి: యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ చంద్రగిరిలో మార్చి 14వతేదీ (గురువారం) నుంచి 30 రోజుల పాటు పూర్తి ఉచితంగా ''మహిళలకు టైలరింగ్‌పై'' శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు సంస్థ డైరెక్టర్ పి.సురేష్ బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెల్లరేషన్ కార్డు కలిగిన తిరుపతి, చిత్తూరు జిల్లా గ్రామీణ ప్రాంతానికి చెందిన 19 నుంచి 45 ఏళ్ల వయసు కలిగిన నిరుద్యోగ మహిళలు శిక్షణకు అర్హులన్నారు. కనీస విద్యార్హత 10వ తరగతి ఉండాలని తెలిపారు. శిక్షణ సమయంలో ఉచిత భోజనం, రానుపోను ఒక్కసారి చార్జీలు ఇవ్వనున్నట్లు చెప్పారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ధ్రువ పత్రాలు ఇవ్వనున్నట్లు వెల్లడించారు. శిక్షణ తీసుకోదలచిన వారు ఆధార్ కార్డు, రేషన్ కార్డు జిరాక్స్ కాపీలు, 4 పాస్‌పోర్టు సైజు ఫొటోలతో సంస్థకి వచ్చి వారి పేరు నమోదు చేయించుకోవాలని ఆయన కోరారు. మరిన్ని వివరాలకు 79896 80587, 94949 51289, 63017 17672 ను సంప్రదించాలన్నారు.

వాటర్ కూలర్ల అందజేత

చంద్రగిరి(తిరుచానూరు): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి ఆలయానికి వాటర్ కూలర్లను దాతలు బహూకరించారు. ఈ మేరకు దాతలు ఆర్ఎస్ బ్రదర్స్ సంస్థ అధినేతలు పొట్టి వెంకటేశ్వర్లు, రాజమౌళి వాటర్ కూలర్లను ఆలయ సూపరింటెండెంట్‌కు అందజేశారు. వారు మాట్లాడుతూ వేసవి కాలం ప్రారంభం కావడంతో అమ్మవారి దర్శనార్థం వచ్చే భక్తుల సౌకర్యార్థం 10 వాటర్ కూలర్‌లను అందించినట్లు తెలిపారు. వీటి విలువ సుమారు రూ.లక్ష ఉంటుందన్నారు. అనంతరం దాతలకు ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేసి, అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

వధూవరులకు ఎమ్మెల్యే పెళ్లికానుక

తిరుపతి మంగళం: నూతన వధూవరులకు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా చైర్మన్, చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిలు పెళ్లికానుక పంపడం ఆనవాయితీ. అందులో భాగంగా సోమవారం మంగళం రణధీర్‌పురంగ్రామ పంచాయతీ బీటీఆర్ కాలనీలో నివాసం ఉంటున్న గాయత్రి అనే వధువుకి ఎమ్మెల్యే చెవిరెడ్డి, తుడా చైర్మన్ మోహిత్‌రెడ్డిలు పంపిన బంగారు తాళిబొట్టు, వెండిమెట్టెలు, పట్టువస్త్రాలు, శ్రీవారి లడ్డుప్రసాదం, శుభాకాంక్షలతో కూడిన గ్రీటింగ్ కార్డును ఆ పంచాయతీ నాయకులు అందజేశారు.

నాటు తుపాకీ స్వాధీనం

చంద్రగిరి: అక్రమంగా తరలిస్తున్న నాటు తుపాకీని చంద్రగిరి పోలీసులు సోమవారం రాత్రి స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. మండల పరిధిలోని పనపాకం పంచాయతీ పాకాలవారిపల్లి సమీపంలోని పోలీసు చెక్‌పోస్టు వద్ద పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. గుర్తు తెలియని వ్యక్తులు ద్విచక్ర వాహనంలో తీసుకొచ్చిన నాటు తుపాకీని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలుస్తోంది.

అభివృద్ధితో మారిన రూపురేఖలు

- రూ.19 కోట్లతో మంగళం పంచాయతీలో అభివృద్ధి
- పంచాయతీల్లో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవ పండుగ
- తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి


సప్తగిరినగర్‌లో నిర్మించిన పెద్దకాలువను పరిశీలిస్తున్న తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

తిరుపతి మంగళం: రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన నాలుగన్నరేళ్లల్లో జరిగిన అభివృద్ధితో గ్రామీణ ప్రాంతాల రూపరేఖలేమారిపోయాయని తుడా చైర్మన్, చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పేర్కొన్నారు. చరిత్రలో కనీవినీ ఎరుగని విధంగా ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి అభివృద్ధికి నాంది పలికారు. రహదారులు, కాలువలు, శుద్ధ నీటి ప్లాంట్‌లు, సచివాలయాలు, రైతు భరోసా కేంద్రం, ఆరోగ్య కేంద్రం, యోగా ధ్యాన మందిరం, సమావేశ మందిరాలు, బెంచీలు, రచ్చ బండలు తదితర అభివృద్ధి పనులతో పల్లెల రూపురేఖలు మారి... అందంగా ముస్తాబయ్యాయి. సోమవారం మంగళం పరిధిలోని సప్తగిరినగర్, రణధీర్‌పురం, మంగళం, తిరుమలనగర్, మంగళం గ్రామ పంచాయతీల్లో జరిగిన అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. ఎన్నడూ లేనంతగా తమ పంచాయతీల్లో ఇంతగా అభివృద్ధి చేసిన మీకు ఏమి ఇచ్చి రుణం తీర్చుకోగలం నాయనా అంటూ స్థానిక ప్రజలు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక మహిళలు హారతులు పట్టి బ్రహ్మరథం పట్టారు. మోహిత్‌రెడ్డి వెంట ఎంపీపీ యశోద, వైస్ ఎంపీపీ విడుదల మాధవ రెడ్డి, పార్టీ డివిజన్ అధ్యక్షుడు నారాయణ రెడ్డి ఉన్నారు.

అభివృద్ధే మా అభిమతం..

అభివృద్ధే అభిమతంగా ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తనవంతు బాధ్యతగా కృషి చేశారని తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పేర్కొన్నారు. చరిత్రలో నిలిచిపోయేలా అభివృద్ధి ఉండాలని భావించారన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా, నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేసి చూపారని తెలిపారు. రాష్ట్రంలో ఏ నియోజకవర్గంలో లేనంతగా చంద్రగిరిలో అభివృద్ధిని పరుగులు పెట్టించారని వివరించారు. అభివృద్ధి పనుల్లో కులం, మతం, ప్రాంతం, పార్టీ చూడలేదన్నారు. ఓటు వేసిన వారికైనా, వేయని వారికైనా ఎమ్మెల్యేనని భావించి అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేశారన్నారు. ఆయన అడుగు జాడల్లో నడుస్తూ ప్రజలకు మరింత చేరువగా ఉంటూ మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుడతానని స్పష్టం చేశారు.

రూ.19 కోట్లతో మంగళం అభివృద్ధి

మంగళం పంచాయతీలోని సప్తగిరినగర్, రణధీర్‌పురం, మంగళం, తిరుమలనగర్ పంచాయతీల్లో రూ.19 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులను తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ప్రారంభించారు. మంగళం పంచాయతీలో రూ.3 కోట్లతో అభివృద్ధి చేసిన సీసీ రోడ్లు, కల్వర్టులు, డ్రెయిన్లు ప్రారంభించారు. అదేవిధంగా సప్తగిరి నగర్ పంచాయతీ రూ.8.60 కోట్లతో అభివృద్ధి పనులు చేశారు. అందులో రూ.1.50 కోట్లతో నిర్మించిన అతి పెద్ద డ్రైనేజీ నిర్మాణంతో ప్రజల సమస్యలను పరిష్కరించారు. ఏ వీధికి వెళ్లినా సీసీ రోడ్లు దర్శనమిస్తాయి. అత్యంత అద్భుతంగా సప్తగిరి కాలనీ రూపుదిద్దుకుంది. రణధీర్‌పురంలో రూ.3 కోట్ల నిధులతో రూపొందిన అభివృద్ధి పనులను చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ప్రారంభించారు. ఇందులో సీసీ రోడ్లు, కాలువలు, ఆర్ఓ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. తిరుమల నగర్‌లో రూ.3.90 కోట్ల అభివృద్ధి పనులు పూర్తయ్యాయి. ఈ పనులను చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ప్రారంభించారు. బీటీ రోడ్లు, సీసీ రోడ్లు, కాలువల ఏర్పాటుతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. కొత్తగా సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. సర్పంచ్‌లు లీలావతి, వకుళ, పంచాయతీల ఇన్‌చార్జ్‌లు లక్ష్మీనారాయణ, అశోక్‌రెడ్డి, గుండ్రాజు శివశంకర్‌రాజు, వరలక్ష్మీ రాంబాబు, ఉప సర్పంచ్ మల్లెమొగ్గల ఉమాపతి, అధ్యక్షులు రజాక్, మహ్మద్‌కాసీమ్, హరికృష్ణ, రమేష్, వార్డు మెంబర్లు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.


మంగళంలో చెవిరెడ్డి మోహిత్‌రెడ్డికి హారతులు పడుతున్న మహిళలు


అభివృద్ధి పనులకు పూజ చేస్తున్న తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం


సీసీ రోడ్డుకు భూమి పూజ చేస్తున్న చెవిరెడ్డి ధ్యానేష్‌రెడ్డి

రామచంద్రాపురం: మండలంలోని కేకేవీపురం, సొరకాయలపాలెం సచివాలయ పరిధిలో ప్రభుత్వ, తుడా ఉమ్మడి నిధులతో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనులను సోమవారం ఎంపీపీ ఏవీ బ్రహ్మానందరెడ్డి, జడ్పీటీసీ ఢిల్లీ భానుకుమార్‌రెడ్డిలతో కలసి తుడా చైర్మన్, చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి సోదరుడు చెవిరెడ్డి ధ్యానేష్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేకేవీపురం, సొరకాయలపాలెం సచివాలయ పరిధిలో జరిగిన 32 పనులకు గానూ రూ.308.95 లక్షల నిధులు వెచ్చించినట్లు తెలిపారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా చంద్రగిరి నియోజకవర్గాన్ని అభివృద్ధిలో రాష్ట్రానికే ఆదర్శంగా నిలిపారన్నారు. ప్రతి పంచాయతీలో తుడా నిధులతో సీసీ రోడ్లు, ఆర్ఓ ప్లాంట్లు, సమావేశ మందిరాలు, కర్మక్రియల భవనాలను ఏర్పాటు చేసిన ఘనత మన ఎమ్మెల్యేకే దక్కిందన్నారు. రానున్న ఎన్నికల్లో చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి నల్లందుల సుధాకర్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షులు, ఎంపీటీసీలు, సర్పంచులు, వైఎస్ఆర్ సీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.


ప్రజాప్రతినిధులతో చెవిరెడ్డి ధ్యానేష్‌రెడ్డి

రిజిస్ట్రేషన్ సమస్య పరిష్కరించండి


తహసీల్దార్ వినతిపత్రం అందిస్తున్న కౌసల్య దంపతులు

తిరుపతి రూరల్: 'సొంత ఇల్లు లేదని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐతేపల్లి వద్ద ఇంటి స్థలం మంజూరు చేయించారు... దానికి శాశ్వత హక్కు కల్పించేందుకు రిజిస్ట్రేషన్ అవకాశం కల్పించారు. అయితే కొన్ని టెక్నికల్ సమస్యతో సచివాలయంలో ఇంటి స్థలం రిజిస్ట్రేషన్ కావడం లేదు. పంచాయతీ సెక్రటరీ అసలు పట్టించుకోవడం లేదు. రిజిస్ట్రేషన్ సమస్యను పరిష్కరించాలి' అని తిరుపతి రూరల్ మండలం సీమల్లవరం గాంధీనగర్‌కు చెందిన కౌసల్య దంపతులు వేడుకున్నారు. ఈ మేరకు సోమవారం తిరుపతి రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో స్పందన కార్యక్రమంలో తహసీల్దార్ మహబూబ్ చాంద్‌కు వినతిపత్రం అందించారు. స్పందించిన తహసీల్దార్ సచివాలయంలో పోర్టల్‌లో మ్యాపింగ్ జరగకపోవడంతో సమస్య వచ్చిందని, తహసీల్దార్ లాగిన్‌లో చేసి రిజిస్ట్రేషన్ పూర్తి చేస్తామని తహసీల్దార్ మహబూబ్ చాంద్ హామీ ఇచ్చారు. పేరూరుకు చెందిన ఓ మహిళ ప్రభుత్వ స్థలంలో ఇల్లు నిర్మించుకునేందుకు అవకాశం కల్పించాలని తహసీల్దార్‌కు వినతిపత్రం అందించడంతో రెవెన్యూ అధికారులు ఆశ్చర్యపోయారు. మరోసారి ఇలాంటి అర్జీలను తీసుకురావద్దని తహసీల్దార్ మహబూబ్ చాంద్ హెచ్చరించారు. స్పందనలో మొత్తం 12 అర్జీలను అందించారు.

నేడు, రేపు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం

- హాజరు కానున్న ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

చంద్రగిరి: మండలంలోని 20 గ్రామ సచివాలయాల పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులు పూర్తికావడంతో వాటిని చంద్రగిరి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి మంగళ, బుధవారాలు రెండు పాటు ప్రారంభించనున్నటు ఎంపీడీఓ డాక్టర్ వీవీ. సూర్యసాయి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 8 గంటలకు పనపాకం పంచాయతీలో ఈ కార్యక్రమం ప్రారంభం కానుందని తలెఇపారు. అక్కడి నుంచి కల్‌రోడ్డుపల్లి, ఎం.కొంగరవారిపల్లి, ఐతేపల్లి, అగరాల, కొటాల, చిన్నరామాపురం, కందులవారిపల్లి, రామిరెడ్డిపల్లి, నరసింగాపురం, మిట్టపాళెం, బుచ్చినాయుడుపల్లిలో పలు ప్రారంభోత్సవాలు ఉంటాయని పేర్కొన్నారు. అలాగే బుధవారం ఉదయం 8 గంటలకు తొండవాడలో ప్రారంభమై శానంబట్ల, పిచ్చినాయుడుపల్లి, రాయలపురం, గంగుడుపల్లి, దోర్నకంబాల, రెడ్డివారిపల్లి, చంద్రగిరిలో ప్రారంభోత్సవాలు నిర్వహించనున్నట్టు వెల్లడించారు.

తిరుచ్చిపై శ్రీసుందరరాజ స్వామి ఊరేగింపు


శ్రీదేవి, భూదేవి సమేత తిరుచ్చిపై భక్తులకు అభయమిస్తున్న శ్రీసుందరరాజ స్వామివారు

చంద్రగిరి(తిరుచానూరు): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి ఆలయానికి అనుబంధంగా వెలసిన శ్రీసుందరరాజ స్వామివారు సోమవారం తిరుచ్చిపై విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. స్వామివారి జన్మనక్షత్రమైన ఉత్తరాభాద్ర సందర్భంగా విశేష పూజలను నిర్వహించారు. తెల్లవారుజామున స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్యకైంకర్యాలను నిర్వహించారు. అనంతరం స్వామివారిని సర్వాంగ సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీసుందరరాజ స్వామివారు తిరుచ్చి వాహనంపై ఆశీనులై నాలుగు మాడవీధులలో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ శేషగిరి, అధికారులు జయకుమార్, సుభాస్కర్ నాయుడు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్ఆర్ సీపీలో చేరిక


టీడీపీ నుంచి వైఎస్ఆర్ సీపీలో చేరిన రావిళ్లవారిపల్లి ఏఏడబ్ల్యూ గ్రామస్తులు

రామచంద్రాపురం: మండలంలోని రావిళ్లవారిపల్లి ఏఏడబ్ల్యూకి చెందిన టీడీపీ నాయకులు నాగరాజు, దొరబాబు, అశోక్, వెంకటేష్, రామయ్య, సుబ్బలమ్మ, పెంచలయ్య, లక్ష్మమ్మ, దిలీప్‌లు మండల ఇన్‌చార్జి నల్లందుల సుధాకర్‌రెడ్డి, తుడా చైర్మన్, చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి సోదరుడు చెవిరెడ్డి ధ్యానేష్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే డా.చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి చేసిన సంక్షేమం, అభివృద్ధి చూసి వైఎస్సార్‌సీపీలో చేరినట్లు స్పష్టం చేశారు. ఎంపీపీ ఏవీ బ్రహ్మానందరెడ్డి, జెడ్పీటీసీ ఢిల్లీ భానుకుమార్‌రెడ్డి, ఎంపీటీసీ రాజేష్, డివిజన్ అధ్యక్షులు భాస్కర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు యశ్వంత్, మహేందర్‌రెడ్డి, జానకీరాం, భాస్కర్‌యాదవ్, ప్రతాప్, కోటీ, మార్కెటింగ్ కమిటీ వైస్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి చేయండి


మాట్లాడుతున్న ఎంపీపీ ఏవీ బ్రహ్మానందరెడ్డి

రామచంద్రాపురం: అధికారులు గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీపీ ఏవీ బ్రహ్మానందరెడ్డి అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు వారి శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి నిధులు మంజూరు చేసి పంచాయతీలను అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. మండల అధికారులు పంచాయతీల్లో పర్యవేక్షించి, సమస్యలను పరిష్కరించాలన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా సత్వర చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం జడ్పీటీసీ ఢిల్లీ భానుకుమార్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామా ల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. మండల వ్యవసాయాధికారి ప్రవంతి రైతు భరోసా కేంద్రాల ద్వారా అందించే సేవలను వివరించారు. మండల విద్యాశాఖాధికారులు మార్కండేయ నాయుడు, జయ వేలు మన బడి నాడు-నేడు, జగనన్న గోరుముద్ద, జగనన్న విద్యాకానుక, అమ్మ ఒడి పథకాలకు సంబంధించిన వివరాలను చదివి వినిపించారు. ఎంపీడీఓ ప్రత్యూష మాట్లాడుతూ అధికారులు సమ న్వయంతో మండలాభివృద్ధిలో పాలుపంచుకోవా లని కోరారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఉషారాణి, సింగిల్ విండో చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్టీసీ సంస్థ ప్రతినిధి ఈశ్వర్ నాయుడు, ఏపీఓ హంసవేణి, వసతి గృహం సంక్షేమ అధికారి నాయక్, ఉద్యానవన శాఖాధికారి సునీల్, ఈఓపీఆర్డీ దేవకి పాల్గొన్నారు.

అభివృద్ధి చేశాం.. ఆదరించండి

- పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవం
- ఎమ్మెల్యే, తుడా చైర్మన్ సహకారంతో అభివృద్ధి పనులు


అంగన్‌వాడీ సెంటర్‌ని ప్రారంభిస్తున్న వల్లివేడు విక్రమ్‌రెడ్డి


పాకాల: అభివృద్ధికి నాంది పలుకుతూ కోట్ల రూపాయలతో పంచాయతీలను అభివృద్ధి చేశామని, ప్రజలందరూ వైఎస్ఆర్ సీపీకి ఓట్లు వేసి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని ఆదరించాలని మండల వైఎస్ఆర్ సీపీ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం మండలంలోని పదిపుట్లబైలు, పేరసానిపల్లి, ఈ-పాలగుట్టపల్లి, వల్లివేడు, రమణయ్యగారిపల్లి పంచాయతీల్లో జరిగిన అభివృద్ధి పనులను మండల నాయకుల చేతుల మీదుగా ప్రారంభించి, పలు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పదిపుట్లబైలు పంచాయతీలో రూ.1.73 కోట్లతో, పేరసానిపల్లి పంచాయతీలో రూ.2.13 కోట్లు, వల్లివేడు పంచాయతీలో రూ.2.31 కోట్లు, ఈ-పాలగుట్టపల్లి రూ.1.17 కోట్లు, రమణయ్యగారిపలి రూ.2.31 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు పేర్కొన్నారు. పంచాయతీల్లో జగనన్న సమావేశ మందిరాలు, మినరల్ ఆర్ఓ వాటర్ ప్లాంట్లు, సీసీ రోడ్లు, డ్రైనేజీలు, జ్ఞానమందిరాలు, అంగన్‌వాడీ సెంటర్లను నిర్మించారని తెలిపారు.

తుడా పరిధిలోకి పాకాల

నియోజవర్గంలోని పాకాల మండలాన్ని తిరుపతి జిల్లాలో విలీనం చేసి, తుడా పరిధిలో చేర్చిన ఘనత మన ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి దక్కుతుందని పేర్కొన్నారు. ప్రతీ పంచాయతీలో అభివృద్ధి పనులకు కోట్ల రూపాయలు వెచ్చించి పనులను పూర్తి చేశారని తెలిపారు. కరోనా లాంటి పకృతి విపత్కర పరిస్థితుల్లో ప్రతిపక్ష నేతలు కంటికి కనిపించకుండా పోయారని, తమ ప్రాణాలను కాపాడుకోవడానికి విదేశాలకు పారిపోయి తల దాచుకున్నారని విమర్శించారు. అయితే ఎమ్మెల్యే చెవిరెడ్డి కుటుంబాన్ని సైతం వదలి, తనకు ఏమైన ఫర్వాలేదని ఇంటింటికీ కూరగాయలు, పండ్లు, గుడ్లు, మాత్రలు, మందులు, ఆనందయ్య మందులు అందజేశారని పేర్కొన్నారు. తండ్రి తగ్గ తనయుడు, తండ్రి బాటలో ప్రజా సేవ చేసే యువ నాయకుడు మన మోహిత్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. ఎంపీపీ లోకనాథం, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ వల్లివేడు విక్రమ్‌రెడ్డి, పొలిటికల్ ఇన్‌చార్జ్ పులికేశవమూర్తిరెడ్డి, రఘుపతి, డివిజన్ అధ్యక్షుడు హరిప్రసాద్‌రెడ్డి, కపిలేశ్వర్‌రెడ్డి, సర్పంచులు బుజ్జమ్మ, శాంతమ్మ, ప్రత్యూష్‌రెడ్డి, యువరాజు, ఎంపీటీసీలు మధు, జేసీపీ బాబు, రవీంద్రరెడ్డి, హరికృష్ణారెడ్డి, నాగరాజనాయుడు, ఈశ్వర్‌రెడ్డి, గోపి, మహ్మద్, శ్రీనివాసులు, రఘు, శ్రీరాములు, హేమంత్‌రెడ్డి, రామలింగారెడ్డి, రామ్మూర్తి, నరేష్, రమేష్‌రెడ్డి, కుమార్, శ్రీరాములు, చెంగల్‌రెడ్డి, నగేష్‌నాయుడు, సురేంద్ర, చెంగల్రాయులు పాల్గొన్నారు.


జగనన్న సమావేశ మందిరాన్ని ప్రారంభిస్తున్న పులికేశవమూర్తిరెడ్డి

చెరువులో పడి యువకుడి మృతి


నాగూర్ ఇమ్రాన్ (ఫైల్)

పాకాల: ప్రమాదవశాత్తు చెరువులోపడి యువకుడు మృతి చెందిన సంఘటన సోమవారం మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం.. మండలంలోని హసన్‌పురం గ్రామానికి చెందిన అనీఫ్, మాస్తాన్-బి కుమారుడు నాగూర్‌ఇమ్రాన్(23) చెన్నుగారిపల్లికి సమీపంలోని పాకాల చెరువులో ఉదయం బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు నీటి గుంతలో పడి మృతి చెందాడు. అటుగా వెళ్లిన పశువుల కాపరులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. అనంతరం మృతుని తల్లిదండ్రులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఏఎస్ఐ వెంకట్రమణనాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.